



రామలింగేశ్వరనగర్ కరకట్టపై ఆగిపోయిన లోడ్‌తో ఉన్న టిప్పర్

ప్రభుత్వ భూములు 'కబ్జా'

మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీలోని ప్రభుత్వ భూములపై పెద్దల కన్నుపడింది. ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటున్న ఈ భూములను ఇటీవల కాలంలో కొందరు కూడబలుక్కుని ఆక్రమించేశారు. భవిష్యత్తులో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఉంచిన భూమిని అన్యాక్రాంతం చేయడమే కాకుండా, ఆపై రొయ్యల చెరువులుగా మార్చేసి తమ అనుయాయులకు అడ్డగోలుగా లీజుకు ఇచ్చేశారు. చిన్నాపురం పంచాయతీలోని కొందరు పెద్దలు తమ అర్థ, అంగ బలాన్ని చూపి అంతా మా ఇష్టం అన్నట్టు వ్యవహరిస్తున్నా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



చిన్నాపురంలోని 8 ఎకరాల్లో రొయ్యల చెరువుల తవ్వకం

రూ. 6లక్షలకు అనధికారికంగా లీజుకు కట్టబెట్టేశారు..

- ఇదే భూమిలో 2022లో అమృత్ సరోవర్ ద్వారా ఉపాధి పనులు
- ప్రభుత్వ భూముల ఆక్రమణ వెనుక పెద్దల హస్తం!
- ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న గ్రామస్తులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీ పరిధిలోని పాటిమీద గ్రామం సమీపంలోని తాళ్లకాయశింకు (డ్రెయినేజీ) గట్టు, మచిలీపట్నం-చిన్నాపురం ప్రధాన రహదారి వెంబడి 42 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. పదేళ్ల క్రితం ఇందులో ఐదు ఎకరాల భూమిని వేసవిలో పశువుల తాగునీటి అవసరాల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా ఊర చెరువును తవ్వారు. ఈ చెరువు పక్కనే తాళ్లకాయశింకు గట్టు పొడవునా ఉన్న ప్రభుత్వ భూమి సంవత్సరాల తరబడి ఖాళీగానే ఉంటోంది. గతంలో ఈ భూమిని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించడంతో గ్రామస్తులంతా ఐక్యంగా అడ్డుకున్నారు. దీంతో అప్పట్లో అక్రమార్కులు ఈ ప్రయత్నం విరమించారు. ఇటీవల కాలంలో గ్రామంలో శ్మశాన వాటికను మెరక చేసే పేరుతో ఇక్కడ మట్టి తవ్వకాలు ప్రారంభించారు. పగలు కొంత మేర మట్టిని శ్మశానం మెరక చేసేందుకు తరలించి, రాత్రి సమయంలో రొయ్యల చెరువులుగా గుట్టుచప్పుడు కాకుండా మార్చివేశారు. ఇందులో నుంచి కొంతమట్టిని తమ సొంత భూముల మెరక పనులకు కూడా తరలించారు. ఇటీవల కాలంలో చిన్నాపురంలో తాగునీటి అవసరాల కోసం 40 నుంచి 50 ఎకరాల విస్తీర్ణంలో తాగునీటి చెరువును తవ్వేందుకు ఈ ప్రభుత్వ మిగతా 6లో..



చిన్నాపురం పంచాయతీలోని ప్రభుత్వ భూముల్లో తవ్విన చెరువు

పంచాయతీకి ఒక్కరూపాయి చెల్లించలేదు

చిన్నాపురం పంచాయతీలోని అన్ని చెరువులకు సంబంధించి వేలం పాటలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పంచాయతీ సెక్రటరీ రాధాకృష్ణ తెలిపారు. పాటిమీద గ్రామంలోని ప్రభుత్వ భూముల్లోని చెరువులకు సంబంధించిన వేలం పాట నిర్వహించకుండా, పంచాయతీ సిబ్బందికి తెలియకుండా చెరువుల్లోకి నీటిని మోటార్ల ద్వారా నింపుతున్నారు, ఈ చెరువుల లీజుకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ఇంతవరకు పంచాయతీకి చెల్లించలేదని ఆయన చెప్పారు.

రూ.6 లక్షలకు లీజు..

పాటిమీద గ్రామం సమీపంలోని తాళ్లకాయశింకు గట్టు పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను రొయ్యల చెరువులుగా మార్చుచేసే సమయంలో డ్రైనేజీ గట్టును సైతం ఆక్రమించేశారు. దిగువ ప్రాంత రైతులు రహదారిగా వాడుకునే గట్టుపైనా చెరువుకట్టను ఎత్తుగా పోశారు. రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా చెరువులను తవ్వించిన కొందరు పెద్దలు తమ అనుయాయులకు రూ.6 లక్షల లీజుకు ఈ రెండు చెరువులను కట్టబెట్టినట్లు సమాచారం. చెరువులను లీజుకు తీసుకున్న వ్యక్తి చెరువులను నీటితో నింపుతున్నారు. చెరువులను అక్రమంగా లీజుకు ఇచ్చిన వ్యవహారంపై భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నారు. పంచాయతీ ద్వారా ఈ చెరువులను లీజుకు ఇస్తున్నట్లుగా చూపేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ చెరువులను రెండు సంవత్సరాలకు గాను లీజుకు ఇస్తున్నట్లుగా చూపేందుకు రూ.1.80లక్షలను కనీస వేలం ధరగా నిర్ణయించినట్లు డీఎల్‌పీవో కార్యాలయం నుంచి పత్రాలు తెచ్చారు. కానీ ఈ వేలం పాటను ఎప్పుడు నిర్వహిస్తారు, ఎన్ని సంవత్సరాలకు లీజుకు ఇస్తారనే అంశాన్ని గోప్యంగా ఉంచారు.

కరకట్టకు టిప్పర్ తిప్పలు

రామలింగేశ్వరనగర్‌లో యథేచ్ఛగా ఇసుక లారీల రాకపోకలు

- కట్టపై మరమ్మతులకు గురవుతున్న టిప్పర్లు
- నిలిచిపోతున్న ట్రాఫిక్.. ఇబ్బందుల్లో వాహనదారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): యనమలకుదురు-స్క్రూబ్రిడ్జి-యనమలకుదురు మార్గంలో వెళ్లాలన్నా.. రావాలన్నా రామలింగేశ్వరనగర్ కరకట్ట ఎక్కి తీరాల్సిందే. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, అవనిగడ్డకు రాకపోకలు సాగించే వాహనాల కోసం నిర్మించిన కరకట్టపై ఇసుక టిప్పర్లు దుమారం రేపుతున్నాయి. పరిమితికి మించిన ఇసుక లోడ్‌తో వెళ్లడమే కాకుండా ఇప్పుడు ఏకంగా కట్టపై ట్రాఫిక్‌ను దారి మళ్లించే పరిస్థితిని తీసుకొస్తున్నాయి. లోడ్‌తో యనమలకుదురు వైపు మిగతా 6లో..

అడ్డుకుంటే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు


కృష్ణాజిల్లాలోని పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి 40-50 టన్నుల ఇసుకతో టిప్పర్లు కరకట్ట పైనుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో కొద్దిరోజుల పాటు ఈ రాకపోకలకు బ్రేక్‌లు పడ్డాయి. తర్వాత పరిస్థితి మామూలుగా మారింది. ఈ టిప్పర్ల కారణంగా పడవలరేవు సెంటర్‌లో తాగునీరు పైపులైన్ జాయింట్ల వద్ద నేల కుంగిపోయింది. దీనితో వీఎంసీ అధికారులు ఈ పైపులైన్ వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. ఇక్కడ పనులు జరుగుతున్నా ఇసుకాసురులకు మాత్రం కళ్ల ముందు డబ్బులే కనిపిస్తున్నాయి. పోలీసులు కొద్దిరోజులపాటు ఈ టిప్పర్లను ఆపడంతో కృష్ణా జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే రంగప్రవేశం చేశారు. నేరుగా ఆయనే పోలీసులకు ఫోన్లు చేసి టిప్పర్లను ఆపొద్దని ఆదేశాలు జారీ చేసినట్టు ప్రచారం నడుస్తోంది. పైగా ఈ ఇసుకను రాజధాని నిర్మాణానికి పంపుతున్నట్టు చెబుతున్నారు. దీని ముసుగులో ఇసుక గుంటూరుకు చేరుకుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ టిప్పర్ల వల్ల ఏ క్షణానైనా తమ ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని పెదపులిపాక వద్ద ప్రజలు ఆందోళన చేశారు.

మరో రూ.69 వేల కోట్ల సమీకరణ!

రాజధాని అమరావతి కోసం సీఆర్‌డీఏ ప్రణాళిక

ముందుకొస్తున్న జాతీయ బ్యాంకుల కన్సార్టియం

- సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో బ్యాంకర్లతో చర్చలు
- ఇప్పటికే రూ.31 వేల కోట్ల మేర సంస్థల నుంచి సమీకరణ
- ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూల నుంచి..
- తాజాగా బ్యాంకుల కన్సార్టియం నుంచి తీసుకోవాలని నిర్ణయం
- భూముల ధరలు పెరగగానే విక్రయించి బ్యాంకులకు చెల్లింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని నిర్మాణానికి మరో రూ.69 వేల కోట్ల మేర నిధులను సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో వంటి సంస్థల నుంచి సీఆర్‌డీఏ రూ.31 వేల కోట్లను రుణాలుగా పొందిన సంగతి తెలిసిందే. అమరావతి విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో మరిన్ని ప్రాజెక్టులకు సిద్ధమవుతున్న దశలో నిధుల అవసరం మరింతగా ఏర్పడుతోంది. దీనికోసం మరో రూ.69 వేల కోట్ల నిధులను సమీకరించేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేస్తోంది. విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో పలు జాతీయ, ప్రైవేటు బ్యాంకులతో సీఆర్‌డీఏ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే పలు జాతీయ బ్యాంకులు రుణాలు ఇవ్వటానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేశాయి. కొన్ని జాతీయ బ్యాంకులు కన్సార్టియంగా ఏర్పడి రుణం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే అంగీకారం తెలిపిన మేరకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కోల నుంచి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ విడుదలైంది. ఇవి కాకుండా మరో 40 వేల కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చుకునేందుకు సీఆర్‌డీఏ అధికారులు బ్యాంకులతో ప్రయత్నాలు చేస్తున్నారు.

భూముల విలువ పెరిగిన వెంటనే..

బ్యాంకుల నుంచి అదనంగా తీసుకునే రూ.69 వేల కోట్ల రుణాన్ని రాజధానిలో ప్రభుత్వం కింద ఉన్న భూముల విలువ పెరిగిన వెంటనే వాటిని విక్రయించి బ్యాంకులకు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకోవాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. రాజధాని నగరాన్ని సెల్ఫ్ ఫైనాన్స్ సిటీగా అభివృద్ధి చేయాలన్నది సీఆర్‌డీఏ అభిప్రాయంగా ఉంది. రాజధాని అమరావతిని మరింత విస్తరించి సకల సదుపాయాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా కూడా స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. రాజధాని పరిసరాల్లో ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. దీని కోసం రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. కేవలం ప్రభుత్వ పాలనకే రాజధాని పరిమితం కాకుండా ఆర్థిక ప్రగతి కూడా సాధించే విధంగా ఉండాలని ప్రపంచ బ్యాంకు చేసిన సూచనను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. అందుకే మరో పది వేల ఎకరాలను భూ సమీకరణ కానీ భూ సేకరణ ద్వారా కానీ సేకరించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో ఉన్న 29 గ్రామాల్లో రూ.47 వేల కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లకు సంబంధించి చూస్తే.. అఖిల భారత సర్వీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాల్గవ తరగతి ఉద్యోగుల భవనాలను ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సీఆర్‌డీఏ అధికారులు నిర్ణయించారు. రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక సదుపాయాల కల్పన ఏడాదిన్నరలో పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు సీఆర్‌డీఏ కాలపరిమితి విధించింది. సచివాలయ టవర్స్, ఇతర భవనాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు వంటి భవనాలు మూడు సంవత్సరాల్లో పూర్తి చేసి తీరాల్సిందేనని దీనికి సంబంధించిన కార్మికులతో పాటు సామగ్రిని త్వరితగతిన సేకరించి వెంటనే రంగంలోకి దిగాలని కాంట్రాక్టు సంస్థలకు మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. రాజధాని అమరావతిలో పరిపాలనా నగర నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితులలో రాబోయే మూడు సంవత్సరాల్లో పూర్తి చేసే విధంగా పటిష్ట ప్రణాళికలను రూపొందించారు. ఈ రాజధాని పరిపాలనా నగర నిర్మాణం వచ్చే నెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఊపందుకోనుందని అధికార యంత్రాంగం చెబుతోంది.

వసూల్ రాజా 'దూకుడు!'

రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) విజయవాడ జోన్ పరిధిలో అవినీతి వ్యవహారాలు తారాస్థాయికి చేరాయి. సంస్థలో ఎక్కడ అవినీతి జరిగినా పసిగట్టాల్సిన విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగమే పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయింది. ఈ విభాగం అధికారి గ్యారేజీల వారీగా సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బలవంతంగా వసూళ్లకు పాల్పడటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆర్టీసీ ఉద్యోగుల సొమ్ముతో మందు, విందు, సరదాలలో మునిగితేలుతున్న సదరు అధికారిని ఆదర్శంగా తీసుకుని డిపో స్థాయి అధికారులు సైతం చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం.

ఆర్టీసీలో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి నిర్వాకం

- ఏజెంట్లను పెట్టుకుని గ్యారేజీల వారీగా కలెక్షన్లు
- సార్ అవినీతిపై స్పందించని మేడమ్
- మేము తక్కువ కాదంటూ రెచ్చిపోతున్న డిపో అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆర్టీసీ డిపోల్లో జరుగుతున్న అవినీతి వ్యవహారాలపై ఉక్కుపాదం మోపాల్సిన విజయవాడ జోన్ పరిధిలోని విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అధికారి అక్రమ వసూళ్లకు పాల్పడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీ గ్యారేజీల వారీగా సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బలవంతంగా ఫోన్‌పేలు చేయించుకోవడం, ఖరీదైన మందు బాటిల్స్ తెప్పించుకోవడం, నాన్‌వెజ్ విందు భోజనాలను సిద్ధం చేయించడం, బస్సులలో అనధికారికంగా వస్తువులను బట్వాడా చేయటం వంటివి ఇక్కడ నిత్యకృత్యం అయ్యాయి. ఈ అధికారి అవినీతి వ్యవహారాలపై ఈయన కన్న పైస్థాయిలో ఉన్న మహిళా అధికారికి లెక్కలేనన్ని ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా ఆమె ఎందుకు పట్టించుకోవటంలేదన్నది ఆర్టీసీలో ఒక మిస్టరీగా మారింది. మేడం ఉదాసీనంగా ఉండటం వెనుక అనేక అనుమానాలు, ఆరోపణలు వినవస్తున్నాయి. విజిలెన్స్ విభాగాన్ని పర్యవేక్షించాల్సిన ఈడీ(ఏ)కు సరైన పట్టు లేకపోవటంతో కిందిస్థాయి విజిలెన్స్ అధికారులు ఏది చెబితే దానికి తలూపుతున్నట్లు సమాచారం. దీంతో వసూళ్ల రాజాపై చర్యలు తీసుకునే పరిస్థితి ఉండటం లేదని తెలిసింది. దాదాపుగా ఉన్నతాధికారులెవరూ విజిలెన్స్ అధికారిపై చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోవటంతో.. వసూళ్ల రాజా మిగతా 6లో..

ఏ పని కావాలన్నా ముడుపులే!

విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంలో ఈ అధికారి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆయన ఇచ్చిన అప్పీల్స్, బదిలీలు, ఓడీలు, లీవులను కనుక పరిశీలిస్తే నూటికి ఎనభై శాతంపైగా ముడుపులు తీసుకుని ఇచ్చినవే ఉన్నట్లు సమాచారం. వీటిలో చాలా వరకు ఖరీదైన మందు బాటిల్స్ ముట్టచెప్పినవి కూడా ఉన్నట్టు తెలిసింది. ఎన్టీఆర్ జిల్లాలో ఇచ్చినన్ని ఔట్ ఆఫ్ డిజిగ్నేషన్స్ (ఓడీ)లు రాష్ట్రంలోనే మరెక్కడా లేవు. దీనిని బట్టి చూస్తే ఎంత విచ్చలవిడిగా ఓడీలు ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. ఈ ఓడీలపై గతంలో 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో కొన్నింటిని తొలగించారు. ఇంకా కొన్ని యథావిధిగానే కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బస్ డిపోల్లో కూడా ఈ విధానం అడ్డగోలుగా కొనసాగుతోంది.



మైల స్నానం చేద్దామని వెళుతూ.. మృత్యు ఒడికి!

- రోడ్డు ప్రమాదంలో తల్లి దుర్మరణం..
- కుమారుడికి తీవ్ర గాయాలు
- రామవరప్పాడు రింగ్ వద్ద ఘటన

మార్కులు తక్కువ వచ్చాయని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

6లో



రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ బాలాజీ తదితరులు

ఘనంగా ద్వాదశ ప్రదక్షిణలు



ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ద్వాదశ ప్రదక్షిణలు ఘనంగా నిర్వహించారు. గంగా సమేత దుర్గామల్లేశ్వరుల ఉత్సవమూర్తులతో అర్చకులు, అధికారులు, భక్తులు 12 సార్లు ప్రదక్షిణలు చేశారు. అనంతరం అద్దాల మండపంలో పవళింపు సేవ కార్యక్రమం జరిగింది.

ఆదర్శప్రాయుడు బీఆర్ అంబేడ్కర్

వాడవాడలా 134వ జయంతి ఉత్సవాలు

» మంత్రి సత్యకుమార్ యాదవ్

వన్‌టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సంస్కర్త, విద్యావేత్త, న్యాయవేత్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ జి.లక్ష్మీశతో కలిసి సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, జాతి గర్వించదగ్గ మహనీయుడు బీఆర్ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న పాలన, పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన విలువలు, సూత్రాలు ముఖ్య కారణమయ్యాయన్నారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే మన రాజ్యాంగం భిన్నమైనదన్నారు. సామాజిక, ఆర్థిక వేత్తగా, న్యాయ నిపుణుడిగా దేశానికి ఆయన విశిష్ట సేవలు అందించారన్నారు. మహిళల హక్కులు, సాధికారిత, విద్యపై ఆయనకు ఉన్న అవగాహన ఎంతో కీలకమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను భావితరాలు గుర్తుంచుకునేలా పంచతీర్థాల పేరుతో ఐదు ప్రత్యేక స్మృతి వనాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం బలహీన వర్గాల జనాభాకు అండగా నిలిచేందుకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అన్నారు. అంబేడ్కర్ రచనలను భవిష్యత్తుతరాలకు ఆదర్శంగా నిలిచేలా వాటిని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, దళిత నాయకులు జి.కిషోర్ కుమార్, ఎం.క్రాంతికుమార్, ఎన్.బాలాజీ, బి.దేవదాస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం స్ఫూర్తి

దాయకం : నెట్టెం రఘురాం

ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ 134వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం నెట్టెం మాట్లాడుతూ, కుల, మత, వర్గ విచక్షణ లేని ఒక సమాజాన్ని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే సూత్రాల ప్రాతిపదికన రంచించిన అంబేడ్కర్ రాజ్యాంగం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. జాతి రత్నాలలో ఒకరు మహాత్మా గాంధీ అయితే, మరొకరు బాబాసాహెబ్ అంబేడ్కర్ అని పేర్కొన్నారు. అకుంఠితమైన దేశభక్తితో అంబేడ్కర్ జాతి ఐక్యతకు దోహదం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు గన్నే ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.


టీడీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి

సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద...

కలెక్టరేట్ : విజయవాడ స్వరాజ్య మైదాన్ (అంబేడ్కర్ స్మృతివనం)లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కలెక్టర్ లక్ష్మీశ పూలమాలలు వుంచి ఘనంగా నివాళులర్పించారు. బాబాసాహెబ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ఆలోచనల స్ఫూర్తితో రాష్ట్రం, దేశాభివృద్ధికి సమిష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి, కమిషనర్ డి.చంద్రశేఖర్, దళిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్‌లో సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాతంత్రవాదులు ఏకం కావాలి : సీపీఐ రామకృష్ణ

భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి లౌకికవాదాన్ని మట్టుపెట్టేందుకు ఇటీవల ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లు అని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాతంత్ర వాదులు ఐక్యంగా పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు సమర్పించిన ఆయన మాట్లాడుతూ, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నేడు పెను ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచి లౌకికవాదాన్ని మట్టుపెట్టేందుకు ఇటీవల ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లు నిదర్శనమన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేకునేందుకు, లౌకికవాదాన్ని కాపాడుకునేందుకు ప్రజాస్వామ్య వాదులు ప్రతిజ్ఞ చేయాలని, అదే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, బీజేపీకి 400పార్లమెంట్ స్థానాలు వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తామంటూ చెప్పిన అంశాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ రామకృష్ణ



రామవరప్పాడు రింగ్ వద్ద ప్రమాద దృశ్యం

మైల స్నానం చేద్దామని వెళుతూ.. మృత్యు ఒడికి!

» రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు

గుణదల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మైలు స్నానం చేద్దామని ఇంటి నుంచి బయలు దేరిన కొద్ది క్షణాలకే.. రోడ్డు ప్రమాదంలో తల్లి మృతిచెందగా.. కుమారుడు తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన రామవరప్పాడు రింగ్ వద్ద సోమవారం జరిగింది. కరెన్సీనగర్‌లో నివాసం ఉంటున్న బోదుల భవాని(47) గృహిణి, కుమారుడు సాయి అరవింద్(20) ప్రభుత్వ ఆసుపత్రి పెస్ట్ కంట్రోల్ విభాగంలో కాంట్రాక్టు బాయ్‌గా పనిచేస్తున్నాడు. సాయి అరవింద్ పెదనాన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో దశదిన కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సాయి అరవింద్ తల్లి భవానీతో కలిసి సోమవారం మైలస్నానం చేసేందుకు కరెన్సీనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై కృష్ణానదికి బయలుదేరారు. రామవరప్పాడు రింగ్ వద్దకు రాగానే ముందు వెళుతున్న వేరొక బైక్ తగలడంతో వీరి వాహనం అదుపుతప్పింది. వెనుక కూర్చున తల్లి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోవడంతో అదే సమయంలో గన్నవరం నుంచి వస్తున్న లారీ చక్రాలు వీరిపై నుంచి వెళ్లాయి. ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా.. సాయి అరవింద్ రెండు కాళ్లు పూర్తిగా నుజ్జు అయ్యాయి. తీవ్ర గాయాలతో సాయి అరవింద్ అమ్మా.. అమ్మా.. అని పిలవడం చూపరులకు కంటతడిపెట్టించింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ రమేష్ కుమార్ సిబ్బందితో కలిసి భవాని మృతదేహాన్ని మార్చురీకి, సాయిఅరవింద్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్కులు తక్కువ వచ్చాయని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య!

ఆటోనగర్ : ఇంటర్ ఫస్టియర్‌లో తక్కువ మార్కులు వచ్చాయనే మనస్తాపంతో ఓ విద్యార్థి ఉరేసుకుని మృతిచెందిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిడమానూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చీరాల మండలం తులసీనగర్‌కు చెందిన మంచాల కృషల్‌రెడ్డి (17) ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని తండ్రికి ఫోన్‌చేసి తెలిపాడు. ఆదివారం రాత్రి తండ్రికి ఫోన్ చేశాడు. బెటర్‌మెంట్ కట్టి మంచి మార్కులు తెచ్చుకుంటానని వివరించాడు. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫోన్‌చేసి కృషల్‌రెడ్డి ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయినట్టు తెలిపారు. తండ్రి వీరా వర్మరెడ్డి ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్‌ది మహోన్నత వ్యక్తిత్వం : మంత్రి సంధ్యారాణి

ఇబ్రహీంపట్నం : ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అందరూ సమానంగా ఉండాలని, అంటరానితనంతో పాటు, రెండు గ్లాసుల పద్ధతి ఉండకూడదని భావించిన మహోన్నత వ్యక్తిత్వం గలిగిన వ్యక్తి భారతరత్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా తొలుత మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆమె ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొండపల్లి గిరిజన సంక్షేమ పాఠశాల, వసతి గృహంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. బాగా చదివితే వారికి గౌరవం ఉంటుందన్నారు. తానుకూడా గిరిజన స్కూల్లో, హాస్టల్లో చదివి ఈ స్థాయికి వచ్చినట్టు చెప్పారు. ఏపీలో 42 వసతి గృహాలకు రూ.156 కోట్లు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జి.కొండూరు మండలం వెల్లటూరులో మంచి వసతులతో భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన మంత్రి హామీ ఇచ్చారు. విద్యా వ్యవస్థలో పెను మార్పులకు మంత్రి లోకేశ్ శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులతో కలిసి మంత్రి ఎమ్మెల్యేలు ధింసా నృత్యం చేశారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి పక్కన ఎమ్మెల్యే వసంత, జంపాల తదితరులు

ప్రభుత్వ భూములు కబ్జా

(5వ పేజీ తరువాయి)

భూమినే ఉపయోగించాలనే ప్రతిపాదన ఉంది.

2022లో అమృత్ సరోవర్ పథకం ద్వారా పనులు

చిన్నాపురం పంచాయతీ పరిధిలోని పాటిమీద గ్రామం సమీపంలోని ప్రభుత్వ భూమిలో కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ సరోవర్ ద్వారా 2022 మేలో 4.10 ఎకరాల విస్తీర్ణంలో రూ.5.58 లక్షల వ్యయంతో చెరువును తవ్వే పనులు చేశారు. ఈ పనులు చేసినట్లుగా చెరువు వద్ద పూర్తి వివరాలతో శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు. పంచాయతీ ద్వారానే ఈ పనులు చేసినట్లుగాను శిలాఫలకంపై రాశారు. మూడేళ్ల తర్వాత అమృత్ సరోవర్ పథకం ద్వారా తవ్విన చెరువును, దాని పక్కనే ఉన్న మరో నాలుగు ఎకరాల భూమిని మొత్తంగా ఎనిమిది ఎకరాల భూమిని రెండు రొయ్యల చెరువులుగా రాత్రికిరాత్రే ఇటీవల తవ్వేశారు.


అమృత్ సరోవర్ ఉద్దేశమిదీ!

అమృత్ సరోవర్ నిధులతో చెరువును తవ్వితే, చెరువు చుట్టూ గట్ల వెంబడి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి, పచ్చని చెట్లను నాటి, కాసేపు కూర్చుని సేదతీరేందుకు సిమెంటు బల్లలను వేయాలి. చెరువు వద్ద ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలి. కూటమి ప్రభుత్వం అమృత్ సరోవర్‌ను పల్లె పుష్కరిణిగా ఇటీవల పేరు మార్పు చేసింది. పాటిమీద చెరువు వద్ద ఇలాంటి ఏర్పాట్లు ఏమీ చేయలేదు. అక్రమంగా చెరువులను తవ్వేసి రొయ్యల చెరువు చుట్టూ ఇతరులు రాకుండా ఉండేలా పరదాలు కట్టారు. ఈ చెరువుల్లో రెండు రోజులుగా మూడు విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తోడుతున్నారు. నియోజకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధుల అండతో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని రొయ్యల చెరువులుగా మార్పు చేయడం గమనార్హం.


అఖిలభారత కిసాన్ జాతీయ మహాసభలకు వెళుతున్న ఏపీ ప్రతినిధులు

అఖిల భారత కిసాన్ మహాసభలకు ఏపీ ప్రతినిధులు

వన్‌టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని నాగపట్నంలో మంగళ, బుధ, గురువారాల్లో జరగనున్న అఖిలభారత కిసాన్ సభ 30వ జాతీయ మహాసభలకు సోమవారం రాష్ట్రం నుంచి 52మంది ప్రతినిధులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏపీ రైతుసంఘం అధ్యక్షుడు బి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్‌లు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చర్చించి తీర్మానం చేయనున్నట్టు చెప్పారు. పంటల సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించాలని, ఇందుకు చట్టబద్ధత కల్పించాలని, దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యలు నివారించేందుకు ఒక పర్యాయం రైతులు, కౌలు రైతులు తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం, కేంద్ర సహకార చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ భవిష్యత్తు ఉద్యమాలకు ఈ మహాసభల్లో ఒక ప్రణాళికను రూపొందించనున్నట్టు తెలిపారు.


కబడ్డీ అసోసియేషన్ సభ్యులతో శాప్ చైర్మన్ రవినాయుడు సమీక్ష

క్రీడల ఖ్యాతిని పెంచేలా కృషిచేయాలి

» శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో క్రీడల ఖ్యాతిని పెంచేందుకు క్రీడాసంఘాలు కృషి చేయాలని, రాష్ట్రంలో అత్యంత ఆదరణ కలిగిన కబడ్డీని బలోపేతం చేసేందుకు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సభ్యులు మరింత చొరవ చూపాలని శాప్ చైర్మన్ రవి నాయుడు పేర్కొన్నారు. శాప్ కార్యాలయంలో సోమవారం కబడ్డీ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కబడ్డీకి పూర్వ వైభవం తీసుకురావాలంటే మండల, జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీలు మరింత సమర్థవంతంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. క్రీడల్లో రాజకీయ ప్రమేయం తగదని, ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. క్రీడాకారుల భవిష్యత్తుతో చెలగాటమాడితే చర్యలు తప్పవని, దీనికి సంబంధించి త్వరలో ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్టు తెలిపారు. హోదా కోసం కాకుండా క్రీడాకారుల భవిష్యత్తు కోసం పనిచేయాలన్నారు. కేవలం అసోసియేషన్ల నిర్లక్ష్యం కారణంగానే ఆర్థికప్రోత్సాహకాల విషయంలో కబడ్డీ వెనుకంజలో ఉందన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దాం

» మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి, కొనకళ్ల నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మచిలీపట్నం లక్ష్మీ టాకీసు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెల్ప్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎస్‌కన్వెన్షన్ హాలులో ఉచిత వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. జిల్లాలో 900 మంది ఎస్సీ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరే విధంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు ముందుకు రావాలన్నారు. శిథిలావస్థలో ఉన్న అంబేడ్కర్ భవనాన్ని రూ.24 కోట్లతో పునర్నిర్మిస్తున్నామన్నారు. త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడతాయన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. కలెక్టరేట్‌లో సీఎస్ఆర్ నిధులతో విశాలమైన సమావేశ మందిరం నిర్మిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, రిజర్వేషన్ల వల్లే తనతో పాటు పలువురు నాయకులకు ఉన్నత పదవులు దక్కాయన్నారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ప్రపంచంలో అతిపెద్ద ప్రైవేట్ లైబ్రరీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయంలో 50 వేల పుస్తకాలు ఉన్నాయన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ, కొలంబియా విశ్వవిద్యాలయం అంబేడ్కర్‌ను తమ వారసత్వ సంపదగా గుర్తించి విశ్వవిద్యాలయం వద్ద విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, రాష్ట్ర నాటకరంగ సంస్థ అధ్యక్షుడు గుమ్మడి గోపాలకృష్ణ, ఎస్సీ సంఘాల నాయకులు గంటా వెంకటేశ్వరరావు, కొడాలి శర్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, పక్కన ఎంపీ బాలశౌరి, కొనకళ్ల నారాయణ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

కరకట్టకు టిప్పర్ తిప్పలు

(5వ పేజీ తరువాయి)

వెళ్తున్న టిప్పర్ ఇస్కాన్ ఆలయం దాటిన తర్వాత అడుగు భాగాన ఉండే కమాన్ విరిగిపోవడంతో కట్టపై అర్థాంతరంగా ఆగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సరిగ్గా టిప్పర్ ఆగిపోయిన సమయానికి అవనిగడ్డ బస్సు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్తుంది. దీంతో వాహనాలు అటు ఇటు వెళ్లే మార్గం లేకుండా పోయింది. స్క్రూబ్రిడ్జి వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్‌కు ఆమడ దూరంలో టిప్పర్ ఆగిపోవడంతో విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. యనమలకుదురు వైపు వాహనాలు వెళ్లకుండా బారికేడ్లను అడ్డుగా పెట్టారు. అటు వైపు వెళ్లే వాహనాలను బెంజ్‌సర్కిల్ వైపునకు మళ్లించారు. టిప్పర్ ఆగిపోయిన సమాచారాన్ని నాలుగో ట్రాఫిక్ స్టేషన్ అధికారులకు వైర్‌లెస్‌సెట్‌లో తెలియజేశారు. ఆ పోలీసులు పడవలరేవు వంతెనకు చేరుకుని యనమలకుదురు వైపు నుంచి స్క్రూబ్రిడ్జి వైపునకు వచ్చే వాహనాలను పటమటలంకలోకి మళ్లించారు. లోడ్ టిప్పర్ ఆగిపోవడంతో కరకట్టపై మళ్లింపులు తప్పలేదు. అదేవిధంగా ఉదయం కరకట్టపై ఒక టాటా ఏస్ వ్యాన్ ఆగిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.

టీడీపీ నేత ఇంటిపై వైసీపీ మూక దాడి!

» అర్ధరాత్రి రాళ్లు విసరడంతో అద్దాలు ధ్వంసం.. కేసు నమోదు

పాయకాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ నేత ముఖ్య అనుచరుడు పాయకాపురానికి చెందిన నేత తన అనుచరులతో కలిసి టీడీపీ నేత ఇంటిపై దాడి చేశారు. అసభ్యకరంగా దూషిస్తూ రాళ్ల విసరడంతో ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం ప్రజాశక్తినగర్ కమ్యూనిటీ హాల్ వెనుక కోరాడ రమణ కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ఇతను ప్రకాష్ నగర్‌లో వెండి పట్టీల వర్క్‌షాప్ నిర్వహిస్తూ స్థానికంగా టీడీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మీసాల రామకృష్ణ ఇటీవల అతడికి ఫోన్ చేసి స్థానికంగా ఉంటున్న మరో టీడీపీ నేతతో తిరగవద్దని, మాట్లాడవద్దని చెప్పాడు. అవేమీ పట్టించుకోకుండా రమణ పార్టీలో తిరుగుతూ తన పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో రామకృష్ణ పది మంది అనుచరులతో కలిసి రమణ ఇంటికి వెళ్లాడు. రమణ ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. రమణ, కుటుంబసభ్యులు భయాందోళనతో ఇంటి నుంచి బయటకు వచ్చారు. దీంతో రామకృష్ణ అనుచరులు పెద్దగా కేకలు వేస్తూ అసభ్యకరంగా దూషించారు. ఎందుకు తిడుతున్నారని ప్రశ్నించగా మరింత రెచ్చిపోయారు. ఇంటి అద్దాలు పగలకొట్టంతో రమణ భార్య లక్ష్మి 100కు ఫోన్ చేసింది. దీంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. నున్న స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఆమె ఫిర్యాదు చేసింది. కోరాడ లక్ష్మి ఫిర్యాదుపై పోలీసులు తొలుత కేసు కట్టకుండా రాజీ యత్నాలు చేసినట్టు సమాచారం. అయితే రాజీ ప్రసక్తేలేదని అర్ధరాత్రి ఇంటిపైకి దాడికి వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి మంత్రి అండతో ఏం చేసినా చెల్లుబాటు అయ్యిందనే ధీమాతో రామకృష్ణ కేసు నమోదు చేయకుండా గట్టి ప్రయత్నాలు చేయగా.. అతడికి స్థానికంగా ఉన్న అధికార పార్టీలోని పలువురు నేతలు సహకారం అందించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. కేసు నమోదు చేయాల్సిందేనని బాధితులు పట్టుబట్టడంతో ఎట్టకేలకు పోలీసులు రౌతు దుర్గారావు, రామకృష్ణ, మరికొందరిపై కేసు నమోదు చేశారు.


రమణ ఇంటి వద్ద గొడవపడుతున్న రామకృష్ణ, అతడి అనుచరులు

వసూల్ రాజా దూకుడు!

(5వ పేజీ తరువాయి)

ఆడింది ఆట.. పాడింది పాటగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ సారే కలెక్షన్‌కు దిగటంతో మేమేమైనా తక్కువా అంటూ ఆర్టీసీ డిపోల్లోని అధికారులు సైతం మరింత రెచ్చిపోతున్నారు. వెరసి.. ఆర్టీసీలో అవినీతి వ్యవస్థ వేళ్లూనుకుపోతోంది.

దుకాణాల దగ్గర దందా!

ఆసియాలోనే అతిపెద్దది పీఎన్‌బీఎస్‌లో విచ్చలవిడిగా అవినీతి వ్యవహారాలు నడుస్తున్నాయి. దుకాణాల వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారు. సైకిల్ స్టాండ్ వాళ్లతో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నట్టు సమాచారం. ప్రయాణికులను ఎక్కించటానికి ద్విచక్రవాహనాలను వేసుకుని వచ్చిన వారు ఖాళీ ప్లేసులో వాహనాలు పెడితే వాటి గాలిని తీయించటం, గొలుసులతో తాళాలు వేయించటం చేస్తున్నారు. లేదంటే సున్నం జల్లిస్తున్నారు. బస్టాండ్‌లో చిన్న స్టిక్కర్ అంటించుకున్నా కమర్షియల్ ప్రచారం పేరుతో వారినుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు సమాచారం. గుంటూరు ప్లాట్‌ఫామ్స్‌ను మార్చిన వ్యవహారంలో అవినీతిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో.. ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. విజిలెన్స్ అధికారి అవినీతి వల్ల ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 'పలువురు డిపో మేనేజర్లు కూడా లంచాలు తీసుకోవడంలో ముందువరసలో ఉంటున్నట్లు సమాచారం. ఆటోనగర్, జగ్గయ్యపేట, మాచర్ల, సత్తెనపల్లి డిపోల పరిధిలో అవినీతి పతాక స్థాయిలో ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విజిలెన్స్ అధికారి తీరుపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

యూనిటీ కప్ విజేత శ్రీకాకుళం జట్టు

పెనమలూరు : ఆలిండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ 80వ వార్షికోత్సవం సందర్భంగా యనమలకుదురులోని కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీ గ్రౌండ్‌లో కృష్ణాజిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఏబీటీఎ జట్టుపై విజయం సాధించినట్టు నిర్వాహకులు తెలిపారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు 12ఓవర్లలో 123పరుగులు చేయగా ఏబీటీఎ జట్టు 12 ఓవర్లలో 88పరుగులు మాత్రమే చేసింది. ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ టీఎస్ రాంబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎల్లారావ్, వైఎస్‌రావు, కేడీబీఈసీ సెక్రటరీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విజేత శ్రీకాకుళం జట్టుతో నిర్వాహకులు

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

నున్నలో ధాన్యం తరలింపునకు వాహనాల ఏర్పాటు



విజయవాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నున్నలో ధాన్యం తరలింపునకు అధికారులు ఎట్టకేలకు వాహనాలను ఏర్పాటు చేశారు. సోమవారం రూరల్ తహసీల్దార్ సుగుణ, ఈస్ట్ జోన్ తహసీల్దార్ రోహిణి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. గత పది రోజులుగా ధాన్యం కొనుగోలుపై అధికారులు అలసత్వం వహించడంతో 700 మెట్రిక్ టన్నుల ధాన్యం నున్నలోని పోలవరం కాలువ వద్ద ఉండిపోయింది. ఈ విషయమై ఆదివారం కలెక్టర్ లక్ష్మీశా ధాన్యం తరలింపునకు వాహనాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం రైతులు ధాన్యం తరలించేందుకు ఐదు వాహనాలను అధికారులు సమకూర్చారు.



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఖాజా, డాక్టర్ అఫ్రోజ్ పర్వీన్

275 మందికి వైద్య పరీక్షలు

ఉయ్యూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్, రెయిన్‌బో దంత వైద్యశాల, అభిలాశ్ ఆర్థోపెడిక్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 275 మందికి దంత, ఎముకల సంబంధించి వైద్యపరీక్షలు చేసి మందులు, పేస్టు, మౌత్‌వాష్‌లు అందజేశారు. ఉర్దూ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ శేషగిరిరావు ప్రారంభించారు. డాక్టర్ ఖాజా, డాక్టర్ అఫ్రోజ్ పర్వీన్, షైను, అభిలాశ్ పాల్గొని వైద్యసేవలందించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, హిమకరబాబు, డిప్యూటీ గవర్నర్ బాపి రాజు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబిరెడ్డి, సభ్యులు పాల్గొని సేవలందించారు.



పారిశుధ్య కార్మికులతో బీజేపీ, జనసేన నాయకులు

పారిశుధ్య కార్మికులకు సత్కారం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అహర్నిశలు కష్టపడి పరిసరాలు శుభ్రం చేస్తు కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్న దేశాన్ని స్వచ్ఛ భారత్‌ను తిర్చి దిద్దడానికి కృషి చేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికుల సేవలు గణనీయమైనవని బీజేపీ జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్ అన్నారు. సోమవారం బాపులపాడు పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను సత్కరించి అభినందించారు. కార్యాక్రమంలో సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, జనసేన, బీజేపీ నాయులు చలమలశెట్టి రమేశ్‌బాబు, వడ్డి శివనాగేశ్వరరావు, యిర్రింకి నాగ శ్రీనివాసనాయుడు, అహమ్మద్, కెల్లా చింతారావు, జింకా నలగామరాజు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీపీ దేవినేని రాజా

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కంకిపాడు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈడుపుగల్లులో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు మాజీ ఎంపీపీ దేవినేని రాజా సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, ఈడుపుగల్లు గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. అదే విధంగా ప్రభుత్వ, సంక్షేమ అభివృద్ధి పథకాలను సర్పంచ్ పందిపాటి ఇందిర ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారని కొనియాడు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ షకార్, జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, చెల్లి సంగీతరావు, రామకృష్ణ, శ్రీను, శ్రీహరి పాల్గొన్నారు.



వైభవంగా రంగమ్మ పేరంటాల ఊయల ఉత్సవం

ఉంగుటూరు : మండలంలోని తేలప్రోలు రంగమ్మ పేరంటాలు మహోత్సవాలు(తిరునాళ్ల)గత మూడురోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అర్చనలతోపాటు రాత్రివేళల్లో ఆలయప్రాంగణంలో జరిపే ఊయలసేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ ప్రాంగణమంతా రద్దీ వాతావరణం నెలకొని కోలాహలంగా మారింది. ఈ నెల 15న ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వారసులు జక్కా చంద్రశేఖర్, జక్కా ఉదయ్, జక్కా రమేష్ తెలిపారు.

ముగిసిన సాఫ్ట్ టెన్నిస్ పోటీలు

రాణిగారితోట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఏపీ అంతర జిల్లాల జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. ఈ పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు మొదటి స్థానం, కృష్ణాజిల్లా ద్వితీయ, ఎన్టీఆర్ జిల్లా తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి.

ఆయుర్వేద ఆసుపత్రికి సుస్తీ!

- కొయ్యగూరుపాడులో నిలిచిపోయిన వైద్యసేవలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న రోగులు

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండల పరిధిలోని కొయ్యగూరపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మూతపడింది. దీంతో చుట్టుపక్కల నాలుగు గ్రామాల ప్రజలు సుమారు ఏడాదిన్నర కాలంగా ఆయుర్వేద వైద్యసేవలకు దూరమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు డాక్టర్ డీ.మౌళీనాయక్ 2023ఆగస్టులో విజయవాడ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్‌గా డిప్యుటేషన్‌పై వెళ్లడంతో అప్పటినుంచి ఈ ఆసుపత్రికి తాళం పడింది. వారానికి కనీసం రెండు, మూడురోజులైనా ఆసుపత్రి తెరచి వైద్యసేవలందిస్తారనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. ఆయుర్వేద వైద్యంకోసం స్థానికులతోపాటు ఆముదాలపల్లి, వింజిరంపాడు, ముక్కపాడు, చేదుర్తిపాడు, గారపాడు తదితర గ్రామాలనుంచి మహిళలు, వృద్ధులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఆయుర్వేదంలో మంచి మందులు అందుబాటులో వుండటంతో ఈ వైద్యశాలకు ప్రజల్లో ఆదరణ పెరిగింది. గత 20నెలలుగా ఆసుపత్రి మూతపడటంవల్ల వైద్యసేవలు బంద్‌కావడంతో ఆయాగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాళం వేసిన ఆసుపత్రినితెరిపించడంలో ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే మూతపడిన ఆసుపత్రిని మళ్లీ తెరిపించి వైద్యసేవలు నిరాటంకంగా అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మూతపడిన కొయ్యగూరపాడు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి



గ్రామసభలో మాట్లాడుతున్న జనసేన నేత చలమలశెట్టి రమేశ్‌బాబు

దళిత సర్పంచ్‌పై వివక్ష చూపితే సహించం

- గ్రామ సభలో జనసేన నేత చలమలశెట్టి రమేశ్‌బాబు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధగా దళితురాలైన బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలాబాయి పట్ల వివక్ష చూపడం అన్యాయమని జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం లో సర్పంచ్ సరిపల్లి కమలాబాయి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో వైసీపీ సర్పంచ్‌కి మద్దతుగా రమేశ్‌బాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గ్రామ సభ ప్రారంభంలోనే రమేశ్‌బాబు మైకు తీసుకొని మాట్లాడుతూ, గత ఎన్నికల్లో సీనియర్ వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు నాయకత్వంలో ఎంతో కష్టపడి ప్రజల ఆదరాభిమానాలతో సర్పంచ్‌గా ఎన్నికైన కమలాబాయిని పక్కకు తోసి పాలక వర్గంలోని అగ్రవర్ణాలకు చెందిన వారు పంచాయతీపై పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలిసి బాధపడుతున్నారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడానికి ప్రయత్నించడాన్ని అంబేడ్కర్ జయంతి సాక్షిగా తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

గ్రామ సభకు వార్డు సభ్యులు డుమ్మా

బాపులపాడు గ్రామసభకు సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు మినహా మిగిలిన వారంతా డుమ్మా కొట్టారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభ నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానం చేయాల్సి ఉండగా అత్యంత ప్రాధాన్యతగా అంబేడ్కర్ జయంతి రోజున నిర్వహించిన సభకు 18 మంది వార్డు సభ్యుల్లో ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కె. గంగభవాని ఈవోపీఆర్డీ కె.లక్ష్మయ్య, కార్యదర్శి పూర్ణేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతోపాటు ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని జనసేన నాయకుడు గరికపాటి శివ శంకర్ అన్నారు. మండలంలోని నాగవరప్పాడులో ఆలయ నిర్వాహకులు, ప్రముఖసిద్ధాంతి లంకా పార్థవరప్రసాద్ శర్మ నేతృత్వంలో శ్రీగణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, మాలికాపురత్తమ్మ, మానసాదేవి, శ్రీకృష్ణ పరివారదేవతా ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. జనసేననేత, శివశంకర్ ప్రతిష్ఠా మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయ నిర్మాణకర్త, విగ్రహాలదాత లంకా పార్థవరప్రసాద్‌శర్మ శివశంకర్‌కు పూలదండలు వేసి వేద ఆశీర్వచనాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రతిష్ఠా మహోత్సవంలో శివశంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొట్టాని మోహనరావు, రాష్ట్ర విద్యార్థి జేఏసీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు చిల్లర రాజేష్, అర్చకులు యు.ఎస్. శివరామకృష్ణశర్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఎస్‌బీఐ ముందంజ

గన్నవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు సేవలందించటమే కాకుండా సమాజ సేవకు తమవంతు సహకారం ఎప్పుడు ఉంటుందని విజయవాడ సర్కిల్ ఎస్‌బీఐ హెచ్ఆర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని బుద్ధవరం కేర్ అండ్ షేర్‌కు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో 5 వాటర్ ప్యూరిఫైర్‌లు, డబల్ డోర్ ఫ్రిజ్, గ్రైండర్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, అనాథ , హెచ్ఐవీ పిల్లలకు కేర్ అండ్ షేర్ అందిస్తున్న ఉచిత విద్య, వైద్య సేవలు ఎనలేనివని చెప్పారు. పూర్వ విద్యార్థి అయిన లేళ్ల సునీల్ ఎస్‌బీఐ ఉద్యోగి కావటంపై అభినందించారు. ఎస్‌బీఐ సిబ్బంది విజయ మాధవి, రాజశేఖర్, దుర్గాప్రసాద్, దిలీప్, రవివర్మ, వనిత, అంబేడ్కర్, వెంకటేశ్వరరావు, హజరయ్య, రాజ్‌కుమార్, ప్రేమ్, రామకుమారి, కేర్ అండ్ షేర్ ఇన్‌చార్జి డెన్నిస్, ప్రసాద్, రత్నం, స్వర్ణకుమారి పాల్గొన్నారు.



కేర్ అండ్ షేర్‌కు వాటర్ ప్యూరిఫైర్‌లు అందజేస్తున్న ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

- వాడవాడలా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి





కానూరు అంబేడ్కర్‌నగర్‌లో జరిగిన జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. గన్నవరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పెనమలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేడ్కర్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కానూరు అంబేడ్కర్ నగర్‌లో జరిగిన అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. చిన్నతనంలో సమాజంలో కులవివక్ష వల్ల చదువుకోవడానికి కూడా ఇబ్బందులు పడి...తండ్రి క్రమశిక్షణలో పెరిగి, పైచదువులకు విదేశాలకు వెళ్లి వచ్చిన ఆయన అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. అంబేడ్కర్ నగర్‌లోని డ్రైనేజి సమస్యకు పరిష్కారం కనుగొంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, సంగెపు రంగారావు, బొంగరాల అబ్రహం, దోనెపూడి రవికిరణ్ పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. నున్నలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు మందా వేణు, చిల్లిముంత కోటేశ్వరరావు, తగరం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. నున్నలో వైసీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు యార్క్కారెడ్డి నాగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

ఉయ్యూరు : అంబేడ్కర్ జయంతి ఆదివారం ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ముదునూరులో టీడీపీ నాయకుడు పాలడుగు సత్యనార్యాణ, విద్యాకమిటీ చైర్మన్ మద్దాల రమేశ్, టీడీ పీ నాయకులు కిషోర్, సుబ్రమణ్యంతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఉయ్యూరు 5వ వార్డులో కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఉయ్యూరు చైర్మన్ వి సత్యనారాయణ పలువురు పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ జయంతి ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతి వేడుకలో పట్టణ సీఐ టీవీవీ రామారావు, చైర్మన్ సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు. గండిగుంటలో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు.

గన్నవరం : దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి కూటమి నాయకులతో కలసి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో కూటమి ప్రభుత్వం మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తుందని టీడీపీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, దయాల రాజేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, మూల్పూరి సాయికళ్యాణి, మేడేపల్లి రమా, దేవినేని సులోచన పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర నేత చిగురుపాటి కుమారస్వామి, నీలం అశోక్, ఫణికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. జనసేన నేత గరికపాటి శివశంకర్, చిమట రవివర్మ, వాకర్స్, దళిత సంఘాల ఆధ్వర్యంలో, అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంకిపాడు : డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణలు అన్నారు. కంకిపాడులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, టీడీపీ నాయకులు పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకటరమణ, మల్లెంపల్లి కల్యాణి, చలవాది రాజా, వణుకూరు విక్రమ్, అన్నరపు శివపార్వతి, షేక్ బాజి, బొర్రా వెంకట్, కాకుమాను రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఉప్పలూరులో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, చలసాని రాధాకృష్ణమూర్తి, పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటి కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు, బోయిన నాగరాజు, కుంటా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : బీఆర్ అంబేడ్కర్ జయంతిని బాపులపాడు మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంపీపీ నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, ఎంపీడీవో జోగేశ్వరరావు, ఎంఈవో రాంబాలసింగ్, ఏవో త్రినా. దరావు నివాళులర్పించారు. బాపులపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, అట్లూరి శ్రీనివాసరావు, మూల్పూరి సాయికల్యాణి, చిరుమామిళ్ల సూర్యం, జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్, పెరికీడులో టీడీపీ నాయకులు వీరమాచనేని సత్యప్రసాద్, దాసరి బెనర్జీ, వీరవల్లిలో సర్పంచ్ పిల్లా అనిత, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పెదఅవుటపల్లిలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆసంఘం నేతలు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆత్కూరు ఎస్సై చావా సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఏఎస్సై రామారావు, సర్పంచ్ బాణావతు తిరుపతమ్మ, ఎంపీటీసీ ఎస్.విజయకుమారి, మాలమహానాడు జిల్లాప్రధాన కార్యదర్శి కోమవరపు ప్రసాద్, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు సరిహద్దు ఆంథోని, పొనుగుమాటి ఉదయభాస్కర్, సాయి బంటి, దొప్పల సురేష్, ఎస్.కుమార్, హేమంత్, కౌశిక్, అంబేడ్కర్‌యూత్ పాల్గొన్నారు. దళితసంఘం ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతిలో ఎంపీపీ వడ్లమూడి సరోజినీ, ఎస్సై యు.గోవిందు, విశ్రాంత ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.



టాస్ ఎగురవేసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న సీఐ బీవీ శివప్రసాద్

యువత సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు దోహదం

గన్నవరం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : యువత సన్మార్గంలో నడిచేందుకు క్రీడలు దోహదపడతాయని సీఐ బివి శివప్రసాద్ అన్నారు. మండలంలోని ముస్తాబాదలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్న మెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ, క్రీడాకారుల్లో స్పోర్టివ్‌నెస్ కలిగి ఉండాలన్నారు. యువత పెడదోవ పడితే జీవితం అంధకారం అవుతుందన్నారు. బెట్టింగ్‌లకు దూరంగా ఉండి యాప్‌లను నమ్మొద్దని చెప్పారు. యాప్‌లలో బెట్టింగ్‌లు చేస్తూ ఎంతో మంది వీధిన పడ్డారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. ప్రతి రోజు యాప్‌లు గురించి, వాటి వల్ల మోసపోయిన వారి గురించి విస్తృత ప్రచారం జరుగుతుందన్నారు. ఖాళీ సమయాల్లో యువత శరీరానికి వ్యాయామం కలిగే క్రీడలు ఆడాలని సూచించారు. వేసవిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. సర్పంచ్ వేము రాధాకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పాలడుగు మల్లికార్జునరావు, మేడేపల్లి రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొనరాజు సాయిరామ్, పాలడుగు రత్నారావు, వీడీ శ్రీనివాస్, కళ్లం శివప్రసాద్, సాల్మన్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన నవమి ఉత్సవాలు

గుణదల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ గ్రౌండ్స్‌లో ఈనెల 6వ తేదీ నుంచి జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. నవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామరాజ్యం రావాలంటే రాముడు ఆచరించన మార్గంలో నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అడ్మిన్ డీసీపీ సరిత అన్నారు. అనంతరం నిర్వహించిన అన్న సంతర్పణలో సురక్ష కమిటి కన్వీనర్ కేవీ నరసయ్య, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పశుపక్షాదుల దాహార్తిని తీర్చండి

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అధిక ఉష్ణోగ్రతల కు పక్షులు, జంతువులు దాహార్తితో అల్లాడుతుంటాయని ప్రతి ఇంటి ముందు భాగంలో తొట్టెల్లో, డాబాలపై ప్లేట్లలో, చిన్న తొట్టెల్లో నీళ్లు ఉంచాలని, అది మనందరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రకటన

నా క్లయింటు అయిన కన్నెగంటి సుధారాణి గారి కుమార్తె అయిన వేముల పావని W/o. వేముల రామకృష్ణ R/o. రామవరప్పాడు. ది.14-04-2025 ఉదయం షుమారు గం.10.00లకు రామవరప్పాడు గ్రామం నుండి ఆటోలో కంకిపాడు గ్రామం వెళ్ళుచుండగా ఆమె యొక్క బ్యాగు పెనమలూరు ఏరియా పరిధిలో జారిపడిపోయినది. సదరు ఆమె యొక్క బ్యాగులో ఆమెకు సంబంధించిన R.S.No.91/3, 186/1, 556ల్లు దాఖలా ప్లాటు నెం.44రు దాఖలా ఇబ్రహీంపట్నం వారియిలాకా, గొల్లపూడి పంచాయితీ ఏరియాలో చ.గ. 106లు (రెండు సెంట్ల 18 గజాలు) ఒరిజినల్ ఖాళీ నివేశ స్థలమునకు చెందిన డాక్యుమెంట్లు కలవు. (గొల్లపూడి SSS కాలనీ)

కావున సదరు పై నెం. దస్తావేజు ఎవరికైనా దొరికినచో ఈక్రింది సెల్ నెం. గల వారికి తెలియపరచి అప్పగించవలసినదిగా కోరుచున్నారు. దీనిపై జరిగే లావాదేవీలకు మా క్లయింటుకు ఎటువంటి సంబంధము లేదు.

వేముల పావని, సెల్ నెం: 9441844593

T. వెంకట్రావు, న్యాయవాది, కొత్తపేట, గన్నవరం. సెల్ నెం: 99891 07107

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

పంచలోహ విగ్రహాలకు అభిషేకాలు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా గుడ్లవల్లేరు రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులు విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు,హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



పంచలోహ విగ్రహానికి అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు



అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రఘురామ్

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

కూచిపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మొవ్వ అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమాలను సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సిహెచ్.రఘురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావుతోపాటు పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, వెంగళరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు అస్వస్థత

పామర్రు, ఏప్రిల్14 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన జ్వరంతో బాధపడుతునే పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా సోమవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో నియోజకవర్గ కేంద్రమైన పామర్రు, అనంతరం మొవ్వమండలంలో పాల్గొని అనంతరం పమిడిముక్కల మండలం మర్రివాడలో జరిగే అంబేద్కర్ జయంతి వేడుకలకు హజరయ్యారు. అక్కడ ఎండతీవ్రతకు బాగా నీరసపడిపోయి అస్వస్థకు గురయ్యారు. దీంతో కూమార్‌రాజా సూచనలమేరకు పార్టీశ్రేణులు పామర్రు పీహెచ్‌సీ వైద్యాశాలకు ఎమ్మెల్యే కుమార్‌రాజాను తీసుకొచ్చారు. వైద్యులు ఎమ్మెల్యేకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఫ్లూయిడ్స్ ఎక్కించి వైద్యసేవలందించారు. అనంతరం ఆసుపత్రి నుంచి డిచార్జీఅయిన ఎమ్మెల్యే విజయవాడకు వెళ్లారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఎవరు అధైర్య పడవద్దని పార్టీశ్రేణులు వెల్లడించారు. పామర్రులో చికిత్సపొందుతున్న ఎమ్మెల్యేని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జితాడిశెట్టి నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, నీటిసంఘం ఉపాధ్యక్షుడు తాడిశెట్టిమధు, మంతెనరామాంజనేయులు, మనోజ్, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, తదితరులు పరామర్శించారు.



పామర్రు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే వర్ల

నేలకు ఒరిగిన చెట్టుకు పునఃజీవం

గుడివాడ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆదివారం రాత్రి వీచిన గాలులకు స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఉన్న చెట్టు నేలకు ఒరిగిపోయింది. అగ్నిమాపక సిబ్బంది రాత్రి 11గంటల సమయంలో భవిష్యత్ భద్రత దళానికి సమాచారమందించారు. స్పందించిన సభ్యులు తాహెర్ భాషా, జి.పూర్ణచంద్రరావులు అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయంలో ఒరిగిన చెట్టుకున్న కొన్ని కొమ్మలను తొలగించి ఒండ్రు మట్టితో కట్టుకట్టి కర్రల సహాయంతో తిరిగి నిలబెట్టారు. చెట్టుకు జీవం పోసేందుకు సహకరించిన అగ్నిమాపక జిల్లా అసిస్టెంట్ అధికారి అంజనేయులు, అగ్నిమాపక సిబ్బంది,పెట్రోలు బంకు సిబ్బందికి భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ కృతజ్ఞతులు తెలిపారు.



మొక్కను నిలబెడుతున్న భవిష్యత్ భద్రత దళం సభ్యులు



బోల్తాకొట్టిన ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ బోల్తా

తోట్లవల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : గరికపర్రు రోడ్డులో సోమవారం ఇసుక ట్రాక్టర్ తిరగబడింది. గురజాడకు చెందిన ట్రాక్టర్‌ను ఇసుక లోడు నింపుకుని తిరిగి వెళుతున్న సమయంలో గరికపర్రు రోడ్డు మలుపు వద్ద డ్రైవర్ ఎస్. అనిల్ అతివేగంగా నడపటంతో రోడ్డుపైన తిరగబడింది. డ్రైవర్ అనిల్ స్వల్పగాయాలతో తృటిలో ప్రాణాపాయం నుండి బయట పడ్డాడు. తిరగబడ్డ ట్రాక్టర్‌తో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు.

అయ్యప్ప శరణుఘోషతో మార్మోగిన పెసరమిల్లి



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న బలరామ్, గంగాధర్‌లు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తులు అయ్యప్ప శరణుఘోషతో పెసరమిల్లి గ్రామం మార్మోగింది. స్థానిక అయ్యప్ప దేవాలయంలో సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్యస్వామి వాసుదేవానంద భారతీ మహాస్వామి చేతులమీదుగా లక్ష్మీ గణపతి, అయ్యప్ప, శ్రీవల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి , దాసాంజనేయ స్వామి, కాలభైరవ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ప్రాణప్రతిష్ఠా, శిఖర ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం, ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం, రాత్రి హరివరాసనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మామిడికోళ్ల సర్పంచ్ వర్రే విజయలక్ష్మి, అల్లూరి రామశాస్త్రులు, అల్లూరి బుజ్జిబాబు, కమ్మిలి ఫణి, శివాజీ, వాసు, పొట్లూరి రవికుమార్, మోహనరావు, దేవిశెట్టి రామకృష్ణ, పరందామయ్య, జిల్లాలోని పలువురు అయ్యప్ప గురుస్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు. గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు నేతృత్వంలో గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ పర్యవేక్షణలో పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.



యంత్రప్రతిష్ఠ చేస్తున్న భారతీ మహాస్వామి



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రైవస్‌కాల్వ వంతెన పరిశీలించిన ఎమ్మెల్యే

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పమిడిముక్కల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) :మర్రివాడ వద్ద రైవస్ కాల్వపై స్లాబ్ కుంగి, గోతులు ఏర్పడి ప్రమాదపుటంచున ఉన్న వంతెనను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం పరిశీలించారు. వంతెనపై కొంతమేర స్లాబ్ కుంగి, పగుళ్ళిచ్చి, గోతులు పడి వాహనాల రాకపోకలకు ప్రమాదభరితంగా ఉన్న పరిస్థితితుల్లో మర్రివాడ, సాయిపురం, జబర్లపూడి, యలమర్రు పరిసర గ్రామాల ప్రజలు బిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో వంతెన పపరిస్థితి నిపొంచిఉన్న ప్రమాదం శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈనేపథ్యంలో మర్రివాడ వచ్చిన ఎమ్మెల్యేకు వంతెన ప్రమాదకర స్థితి ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయాన్ని స్థానికులు తెలియచేశారు. ప్రమాదపుటంచున ఉన్న వంతె నను పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పరిశీలించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే తగుచర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవా లనిసూచించారు.

అగ్నిప్రమాదాల నివారణే ధ్యేయం

● ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం

గుడివాడ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాల నివారణకు భద్రతా పరికరాలు నిర్వహణ కీలకమని ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని అగ్నిమాపక సేవలశాఖ కార్యాలయంలో రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందిస్తున్న అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌డీవో బాలసుబ్రహ్మణ్యం



అవార్డును అందుకుంటున్న మాంటిస్సోరి యాకూబ్ పాషా



అవార్డును అందుకుంటున్న ప్రత్యూష

ఉపాధ్యాయులకు ప్రతిభా అవార్డులు

గుడివాడ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని ఏసీ కళాశాలలో ఆదివారం సదరన్ ప్రైవేట్ టీచర్స్ అర్గనైజేషన్(ఎస్‌పిఎల్‌టివో) వారి ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు సయ్యద్ యాకూబ్ పాషా, స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల తెలుగు విభాగాధిపతి డా.డి.ఎన్ ప్రత్యూషలు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు చేతుల మీదగా డా.బిఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డునందుకున్నారు. అవార్డులందుకున్న యాకూబ్‌పాషా, డా.ప్రత్యూషలను పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

గ్రామాల్లో వరిగడ్డి కొరత

గుడివాడ రూరల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో పశువులకు వరి గడ్డి కొరత తీవ్రంగా ఉంది. వరి పంట చేతికొచ్చిన సమయంలో వాతావరణం మార్పుల వల్ల చాలా మంది మిషనరీ ద్వారా వరి నూర్పిళ్లు జరిగాయి. తక్కువ మంది రైతులు కుప్పలు వేసి ధాన్యాన్ని నూర్చారు. ఈ కారణాల వల్ల మండలంలో వరిగడ్డి కొరత ఎక్కువగా ఉంది. ఎకరం వరి గడ్డి రూ.10 వేలకు పైగా పలుకుతోంది. పొలంలోని ఎకరం వరి గడ్డిని రూ.10 వేలకు కొన్న రైతు దానిని ఇంటికి చేర్చుకోవటానికి రవాణా ఖర్చులకు రూ.3 వేలు అవుతుంది. ఒక ఎకరం పొలం వరి గడ్డి వామి ఇంటికి రావటానికి రూ.13 వేల నుంచి 14 వేలు ఖర్చు అవుతుంది. ఇది రైతుకు భారంగా మారుతుంది. తెచ్చిన వరి గడ్డిని వాములు చక్కగా వేసే కూలీలు కూడా కొరత ఏర్పడుతుంది. రైతులు పశువులను మేపాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. చాలా మంది గ్రామాల్లో వరి గడ్డి కొరత ఎక్కువగా ఉంది.

పశువుల మేత దొరకడం లేదు

ఈ ఖరీఫ్ సీజన్‌లో రెండు సార్లు వరి పంట తుపాను వల్ల నష్టం కలిగింది. దీంతో కౌలు రైతులు ఎక్కువగా ఉండటంతో తమ పంటను మిషన్ సాయంతో కోతలు కోశారు. దీంతో పశువుల మేత చాలా కొరతగా ఉంది. అధికారులు స్పందించి పరిష్కార మార్గం అన్వేషించాలి.

మసిముక్కు గోపాలకృష్ణ



వరి గడ్డి వామి

జనసేన పార్టీ దిమ్మె ధ్వంసం

తోట్లవల్లూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : యాకమూరులో జనసేన పార్టీ జెండా దిమ్మెను ఆదివారం అర్థరాత్రి అగంతకులు ధ్వంసం చేశారు. పుల్లేటి కాలువ ప్రక్కన ఉన్న జెండా దిమ్మెను అర్థరాత్రి 12 గంటల సమయంలో ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి బ్యానర్‌ను చించి జెండా పైపుని వంచేశారు. దీంతో దిమ్మె పాడైంది. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎస్ కృష్ణసుమన్ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ వై చిట్టిబాబు పరిశీలించారని ఆయన తెలిపారు.

బాటసారులకు మ్యాంగో జ్యూస్ పంపిణీ

పెదపారుపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం సందర్భంగా వాసవీ క్లబ్ వెంట్రప్రగడ వారి ఆధ్వర్యంలో క్లబ్ ప్రెసిడెంట్ దారెడ్ల కోటేశ్వరరావు ఆరెంజ్, మ్యాంగో జ్యూస్‌ను చలివేంద్రం వద్ద ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డి.కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సిహెచ్.వి.రమణారావు, రవిచంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కూచిపూడి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల సందర్భంగా కూచిపూడిలో ఆయన విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి నేతలు నరేష్, ఏఎంసీ చైర్మన్ శివరామయ్య, రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, తాతినేని పూర్ణచంద్రరావు, వీరంకి తులసీ దాస్, తూము పూర్ణచంద్రరావు, అమర బాలేశ్వరరావు, ఇమ్మానియేలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో పయనించటమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని మాజీ ఎమ్మెల్యే డీవై.దాస్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా కూచిపూడి, మొవ్వ తదితర గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక గౌరీశంకరపురంలో సోమవారం ఆదిమాంధ్ర సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెనిగండ్ల వారియర్స్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ(నాని), చేకూరు జగన్మోహనరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులు కొడాలి రామరాజు, మురళీల ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు అంబేడ్కర్ విగ్రహాలకు జి.డేవిడ్‌రాజు, డి.రామారావు, మహేష్‌లు నివాళులర్పించారు.

పామర్రు: పామర్రులో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో నాలుగురోడ్ల కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. మరోమాజీఎమ్మెల్యే డివైదాసు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జితాడిశెట్టి నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌చంద్ర, కృష్ణాడెల్టాప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ గణేష్ పూలమాలలేసి నివాళులర్పించారు.



కూచిపూడిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

గుడివాడ రూరల్: మండల కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను సోమవారం ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ ఘనంగా నిర్వహించారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులోని బొడ్డపాడు, రొయ్యూరు గ్రామాల్లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, సర్పంచ్ మూడే శివశంకర్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పెనమకూరులో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, తలశిల శ్రీనివాసప్రసాద్, వీరంకి వరహాలరావు, ఉపసర్పంచ్ పరశురామ్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తోట్లవల్లూరులో మండల వైసీపీ అధ్యక్షుడు కళ్ళం వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ రాజామణి, సర్పంచ్ పి రాధిక, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలే వేసి నివాళులర్పించారు.

పెదపారుపూడి : పెదపారుపూడిలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ, వైసీపీ మండల అధ్యక్షులు సురేష్, గోళ్ల సోమేశ్వరరావు, పోనుగుమాటి బాబురావు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెదపారుపూడి: వెంట్రప్రగడ హరిజనవాడలో ఉన్న విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పధాన కార్యదర్శిరాంబాబు, సుబ్బయ్య, పాల్గొన్నారు.

నందివాడ: భారతరత్న అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు మండలంలోని నందివాడ, తుమ్మలపల్లి, వెన్ననపూడి, కుదరవల్లి, రామాపురం, అరిపిరాల, ఇలపర్రు, పొలుకొండ, రుద్రపాక, వెన్ననపూడి, అనమనపూడి, దండిగానపూడి, పొనుకుమాడు, తమిరిశ, ఎంబి.నగర్, పెదలింగాల, జనార్థనపురం, నూతలపాడు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

పమిడిముక్కల : పమిడిముక్కలలో హనుమంతపురంలో సచివాలయంలో మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, సర్పంచ్ రాంబాబు, టీడీపీ నాయకుడు జయచంద్రతో కలసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మర్రివాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అంబేడ్కర్ విగ్ర హానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.



అంబేడ్కర్ భవన్‌లో పాల్గొన్న ఆర్‌డీవో, అసిస్టెంట్ కమిషనర్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420



నాగ మనోజ్ఞకు నాట్య కౌముది అవార్డు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నానికి చెందిన మండదపు నాగ మనోజ్ఞకు స్వర్ణగిరి కళా సంస్థ హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి నాట్య కౌముది అవార్డు ఇచ్చి సత్కరించింది. విజయవాడ లాస్య కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వాహకుడు దేవరకొండ చంద్రశేఖర్ వద్ద కూచిపూడి నాట్యం నేర్చుకున్న నాగమనోజ్ఞను ఈసందర్భంగా పలువురు ప్రముఖులు అభినందించారు.

లక్ష్య సాధనకు కష్టపడి చదవాలి

● కలెక్టర్ బాలాజీ ఉద్బోధ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్థినులు ఉన్నత స్థితికి ఎదగాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మచిలీపట్నం లేడియాంప్తిల్ కళాశాల ప్రాంగణంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం ఆయన సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. వసతి గృహంలో ఉదయం 5 గంటలకు నిద్ర లేవాలని నోటీసు బోర్డులో ఉందన్నారు. పెందలకడ నిద్రలేచి చదువుపై దృష్టి సారించాలన్నారు.



ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

యుక్త వయస్సులో ఆకర్షణలకు గురి కాకుండా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ జీవితంలో స్థిరపడే వరకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. సెల్‌ఫోను వినియోగం తగ్గించాలన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన అవనిగడ్డ విద్యార్థి మేఘన సంధ్యతో కలెక్టర్ మాట్లాడి అభినందించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు షాహిద్ బాబు, ఎన్.రాయన్న, నటరాజు, రాణి పాల్గొన్నారు.



స్నేహాలయ వృద్ధాశ్రమానికి వాషింగ్ మిషన్ అందజేస్తున్న ఎస్‌బీఐ మచిలీపట్నం రీజినల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, విజయమాధవి, దిలీప్

మంగినపూడిలో ఎస్‌బీఐ సేవా కార్యక్రమాలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మంగినపూడిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహాలయ వృద్ధాశ్రమానికి ఫ్రిజ్, వాషింగ్ మిషన్, వింగ్స్ ఔట్ రీచ్ చిల్డ్రన్స్ హోమ్‌కు ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజినల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం, ఎస్‌బీఐ సేవా విజయవాడ మాడ్యూల్ డీజీఎస్ ఎం.విజయమాధవి, వైస్ ప్రెసిడెంట్ బి.దిలీప్, ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బొర్రా పరశురామ్‌కు కొనకళ్ల అభినందన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జరిగిన జాతీయ స్థాయి చిల్డ్రన్ ఆర్ట్ పోటీల్లో మచిలీపట్నం నిర్మలా స్కూల్ రెండో తరగతి విద్యార్థి బొర్రా పరశురామ్‌కు ద్వితీయ బహుమతి లభించింది. పరశురామ్‌ను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు బుల్లయ్య, ఫణికుమార్ తదితరులు అభినందించారు.



విరాళం చెక్కును అందిస్తున్న దాసరి రామ్మోహనరావు

స్వచ్ఛ చల్లపల్లికి విశ్రాంత పీఈటీ రూ.లక్ష విరాళం

చల్లపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి సాధనకు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేస్తున్న మన కోసం మనం ట్రస్టుకు విశ్రాంత పీఈటీ దాసరి రామ్మోహనరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు. సోమవారం 3443వ రోజు స్వచ్ఛసేవలో పాల్గొన్న ఆయన స్వచ్ఛ కార్యకర్తల సేవలను అభి నందించారు. భార్య దాసరి స్వర్ణలత నాల్గవ వర్ధంతి సందర్భంగా విరాళాన్ని ట్రస్ట్ సభ్యులు నల్లూరి రామారావుకు అందించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, ప్రాతూరి ఉదయశంకర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

చల్లపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణానికి దళితవాడ వద్ద సోమవారం భూమి పూజ జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కొనకళ్ల బుల్లయ్య, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు స్థానిక నేతలతో కలిసి భూమిపూజ చేశారు. జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వెంకటేశ్వరమ్మ, పైడిపాముల స్వప్న, సజ్జా చలపతిరావు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, యార్లగడ్డ లంకబాబు, తలశిల స్వర్ణలత, మత్తి వెంకటేశ్వరరావు, కొడాలి మురళి, ముమ్మనేని నాని, తాడికొండ చిన్నా, మాచవరపు ఆదినారాయణ, రాయపూడి వేణుగోపాలరావు, లకనం నాగాంజనేయులు, కొల్లూరి బసవ, కొక్కిలిగడ్డ నవీన్, షేక్ నబీషోరి, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, బచ్చు కృష్ణకుమారి, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, వివిధ గ్రామాల కూటమి నేతల పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న కనపర్తి, దేవనబోయిన, గొట్టిపాటి, బుల్లయ్య

బోలెం రామారావుకు ఘన సన్మానం

చల్లపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉగాది, అంబేద్కర్ జయంతి సందర్భంగా జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ నుంచి జాతీయ బంగారు నంది అవార్డును పొందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావును స్నేహితులు సన్మానించారు. చల్లపల్లి రాజా హైస్కూల్ 1980-81 బ్యాచ్ మిత్రులు మిక్కిలినేని మధు, అన్నవరపు పాండురంగారావు నేతృత్వంలో రామారావును సన్మానించి అభినందనలు తెలిపారు. కేశనకుర్తి శరత్‌బాబు, కెవిఆర్ఎస్.మిత్ర, పాలడుగు రత్నబాబు, భోగాది వాసుదేవరావు, అల్లంశెట్టి మాణిక్యాలరావు, పైడిపాముల రాజేంద్ర, శాస్త్రి, చాన్‌ఖాన్, పూర్ణ, సాయి, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, పిచ్చేశ్వరరావు తదితరులు ఉన్నారు.



సామూహిక కుంకుమార్చన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం మళయాళ ఉగాది సందర్భంగా మాలికాపురత్తమ్మ, లలితా పరమేశ్వరి అమ్మవార్లకు సువాసినులు కుంకుమార్చనలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో అర్చకుడు చేబ్రోలు వెంకట విజయ ఆనంద శర్మ, గరుడ సేవా సమితి అధ్యక్షురాలు చిట్టికుమారి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మోపిదేవి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగపర్చు కోవాల్సిందిగా జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు తెలిపారు. నాగాయితిప్ప గ్రామపంచాయతీలో ఉపాధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కృష్ణానది పాత కరకట్ట నుంచి ఉప్పాల యేసు పొలం వరకు 900 మీటర్ల పొడవున పంట బోదు తవ్వకం పనులను ఆయన ప్రారంభించారు. రావి నాగేశ్వరరావు, బళ్ల సీతారామ్ ప్రసాద్, వెంకటేశ్వరరావు ఉన్నారు.



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు మల్లిఖార్జునరావు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం ఇచ్చి నివారించాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమంతరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక అధికారి పి.ఎస్.వి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్టీసీ డీఎం హనుమంతరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.





మహిళలకు సర్దిచెబుతున్న పోలీసులు

అంబేడ్కర్ విగ్రహం వద్ద మరోసారి ఉద్రిక్తత

పెడన, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆరో వార్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం మరోసారి ఉద్రిక్తత నెలకొంది. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో గతంలో ఇరువర్గాల మధ్య గొడవలు జరిగాయి. పోలీసు పికెట్ కూడా ఏర్పాటు చేశారు. పాతగొడవల కారణంగా సోమవారం ఇద్దరి మధ్య ఏర్పడిన వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానికంగా నివాసం ఉండే గఫార్ కారు బయటకు తీయగా మనోజ్ అనే వ్యక్తి అడ్డం రావడంతో హారన్ కొట్టాడు. అయినా మనోజ్ తప్పుకోలేదు. దీంతో పికెట్‌లో ఉన్న పోలీసులు మనోజ్ ను పక్కకు తప్పించారు. ఆగ్రహం చెందిన మనోజ్ దూషించాడు. గఫార్ కారు దిగి మనోజ్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో మనోజ్ వర్గానికి చెం దిన మహిళలు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆం దోళనకు దిగారు. సమాచారం అందుకున్న డీఎస్పీ సిహెచ్ రాజా, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యనారాయణలు సంఘటనా స్థలానికి వెళ్లి మహిళలకు నచ్చచెప్పి ఆందోళన విరమింప చేశారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

నాగాయలంక, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లి శివారు కుమ్మరిపాలెం గ్రామంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని గ్రామస్థులు అధికారులను కోరారు. సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. గ్రామ ప్రజలు కుమ్మరిపాలెంలో శ్మశాన స్థలం, భావదేవరపల్లి తూర్పు హరిజనవాడ రక్షిత మంచినీటి పథకం నుంచి కుమ్మరిపాలెం వరకు మంచినీటి పైపులైను నిర్మాణం చేయాలని కోరగా, గ్రామసభలో తీర్మానం చేశారు. అనంతరం 12 మందితో కమిటీని నియమించారు. వీఆర్వో భోగాది మల్లిక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఘంటసాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : చిట్టూర్పు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూసారం మెరుగుపడుతుందన్నారు మేలైన ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించుకోవచ్చునని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీ లక్ష్మీ కృష్ణవేణి, అచ్చమాంబదేవి, వెంకట్రావు, లత తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవర్ధన్ కుటుంబానికి పరామర్శ

కోడూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నక్కవానిదారి గ్రామంలో బాధిత లక్ష్మీవర్ధన్ కుటుంబాన్ని టీడీపీ నేతలు బండే శ్రీనివాసరావు, పూతబోయిన శ్రీనివాసరావు, నాంచారయ్య, మల్లిఖార్జునరావు, రవీంద్ర, జాన్‌విల్సన్ పరామర్శించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ గంగాధరరావు



పీటీడీ అధికారి వాణిశ్రీ, డీఎం పెద్దిరాజు







మోదుమూడిలో సీఐ యువకుమార్, పర్ణశాలలో ఎమ్మెల్యే కాగిత, నాగాయలంకలో కూటమి నేతల నివాళి

అంబేడ్కర్‌కు ఘననివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఆర్. గంగాధరరావు, ఆర్టీసీ కార్యాలయంలో జిల్లా ప్రజారవాణా అధికారి వాణిశ్రీ, డీఎం పెద్దిరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజుపేటలో టీడీపీ నాయకుడు కొడాలి అంజయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవా శిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగప్రకాష్, బొందిలి నాగమ్మ, ఎన్. వసంతకుమారి, గుమ్మడి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. చిన్నాపురంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు. చిన్నకానూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. **పెడన :** బస్టాండ్ సెంటర్ పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, బెజవాడ నాగరాజు, కమ్మగంటి బాబు, హమీదుల్లా, వీణం శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు. పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **పెడన రూరల్ :** ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ లంకలకలవగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మడక, నందమూరు, నడుపూరు, కూడూరు, నందిగామ, పెనుమల్లి, చేవేంద్ర, చెన్నూరు, ఉరివి, శేరీవర్ధర్లపల్లి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. **గూడూరు :** పర్ణశాలలో అంబేడ్కర్ విగ్రహానికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, కైలా బాలకృష్ణ, గోపీ నాగబాబు, విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నారికేడలపాలెంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, కారుమంచి కామేశ్వరరావు, సర్పంచ్ జంపన రమాదేవి, అవినాష్, పర్లం పెదబాబు, గూడూరులో సర్పంచ్ లింగం సులోచనరాణి, విజయకుమార్, మల్లవోలులో సర్పంచ్ బొర్రా సాంబయ్య, గూడూరు నీలం దళితవాడ, నగరం, మద్దాల దళితవాడ, పఠాన్‌పేట, చిట్టిగూడూరులలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **అవనిగడ్డ :** నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, తలశిల స్వర్ణలత, కర్రా సుధాకర్, మాచవరపు ఆదినారాయణ, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, బచ్చు కృష్ణకుమారి, లకనం నాగాంజనేయులు, మండలి రామ్మోహనరావు, బండే రాఘవ, మేడికొండ విజయ్, గోసాల బాలకోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ సోమేశ్వరరావు, మట్ట విజయ ప్రసాద్, కొల్లూరి వాసు,



పెదప్రోలులో ..



కోడూరులో..



ఘంటసాలపాలెంలో..



పెడన బస్టాండ్ సెంటర్‌లో..

సనకా అన్నపూర్ణమ్మ, కొల్లూరి బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నేరేళ్లపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి కనపర్తి శ్రీనివాసరావు, కొల్లూరు వెంకటేశ్వరరావు, తలశిల స్వర్ణలత, మత్తి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, రాయపూడి వేణుగోపాలరావు, తుంగల వెంకటగిరి, బండే కనకదుర్గ, రాజనాల వీరబాబు, లకనం నాగాంజనేయులు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు కృష్ణకుమారి, అన్నపరెడ్డి వెంకట స్వామి, బండే రాఘవ, షేక్ మొగల్ మురాద్ బేగ్, చెన్ను శివాజీ, దేగల రాఘవ, మేడికొండ విజయ్, కొల్లూరి వాసుర, కొల్లూరి ఇమ్మానియేలు నివాళులర్పించారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ శివారు పాతకోటలో జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పులిగడ్డ, అవనిగడ్డ సర్పంచ్‌లు దాసరి విజయ్ కుమార్, గొరుముచ్చు ఉమా, జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, చింతలపూడి బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. బందలాయిచెరువులో అంబేడ్కర్ విగ్రహానికి పుట్టి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు. మోదుమూడిలో అంబేడ్కర్ విగ్రహానికి సీఐ యువకుమార్ నివాళులర్పించారు. ఎస్సై శ్రీనివాస్, టీడీపీ నాయకులు కంచర్లపల్లి ఆనంద్, సురేష్, గ్రామస్థులు పాల్గొన్నారు. వేకనూరు దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి చాట్రగడ్డ రాజశేఖర్ నివాళులర్పించారు. వేకనూరులో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డి.వై.దాసు నివాళుర్పించారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్, పుట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **నాగాయలంక :** నాగాయలంక సెంటర్‌లో కనపర్తి శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, తలశిల స్వర్ణలత, మేడికొండ విజయ్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాగాయలంక దళితవాడ, మర్రిపాలెం, పెదపాలెం, నంగేగడ్డ, బర్రంకుల, చోడవరం, గణపేశ్వరంలోని అంబేడ్కర్ విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **మోపిదేవి :** మోపిదేవి, పెదప్రోలు, నాగాయితిప్ప, వెంకటాపురం, బొబ్బర్లంక, పెదకళ్లేపల్లి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మోపిదేవిలో అంబేడ్కర్ యువజన కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఎంపీపీ రావి దుర్గావాణి, మల్లిఖార్జునరావు, సర్పంచ్‌లు పోలిమేట్ల ఏసుబాబు, నందిగం మేరీరాణి, దొప్పలపూడి గంగాభవాని, నకడుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్ తదితరులు నివాళులర్పించారు. **కోడూరు :** నాయుడుపేటలోని యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అప్పికట్ల రవీంద్రబాబు, పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీకృష్ణ, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, అద్దంకి పాండురంగారావు, కాగిత ప్రసాద్, గోగినేని సోమశేఖరరావు, తాతా పోతురాజు, ఉప్పల పోతురాజు, బొడ్డు వెంకన్న, బొలిశెట్టి విఠల్‌రావు పాల్గొన్నారు. **ఘంటసాల :** ఘంటసాలపాలెంలోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ దోనె రజని పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ ప్రముఖులు గొరుముచ్చు వెంకటేశ్వరరావు, దోనె వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, ఆశా వర్కర్ జి.కమల, చీర్ల రాము, బుల్లియ్య, గొరుముచ్చు శ్రీనివాసరావు, దోనె నాగమల్లి, గొరుముచ్చు వెంకటేశ్వరరావు, చీర్ల వెంకటేశ్వరరావు, గొరుముచ్చు శివ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు, అంబేడ్కర్ యువజన సంఘం, జైభీమ్ సంఘాల నేతలు, వివిధ పార్టీల ప్రముఖులు నివాళుల ర్పించారు. గంగులవారిపాలెం, లక్ష్మీపురం దళితవాడ, పుచ్చగడ్డలో, మంగళాపురం, మాజేరు దళితవాడ, నిమ్మగడ్డ, నాదెళ్లవారిపాలెం, పురిటిగడ్డ, వక్కలగడ్డ దళితవాడల్లో అంబేడ్కర్ విగ్రహాలకు దళితులు, నేతలు నివాళులు అర్పించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పి.వి.మాధవేంద్రరావు, మోర్ల రాంబాబు, విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, మీర్ రిజ్వాన్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.